# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారు.
2. ఆంధ్రప్రదేశ్‌లో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు.
3. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో గంధమల్ల జలాశయానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేస్తారు.
4. ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు నుంచి డిఎస్సి పరీక్షలు జరుగుతున్నాయి.
5. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న కరవు భత్యం-డీఏలలో రెండింటిని చెల్లించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు జమ్మూ కాశ్మీర్ లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ -యుఎస్‌బిఆర్‌ఎల్ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారు. 272 కిలోమీటర్ల కలిగిన ఈ ప్రాజెక్టును దాదాపు 44 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా విద్యుద్దీకరణతో 36 సొరంగాలు, 943 వంతెనలను కలిగి ఉంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన, భారతదేశ మొట్టమొదటి కేబుల్ స్టేడ్ రైల్వే వంతెనగ చీనాబ్ వంతెన, అంజి వంతెనను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టు కాశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలకు మధ్య రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో పొగాకు, మామిడి, కోకో పంటలకు గిట్టుబాటు ధరలపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, మద్దిపాడు యార్డుల ద్వారా ఈ రోజు నుంచి సేకరణ ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. మామిడికి కిలో 12 రూపాయల చొప్పున చెల్లించి

కొనుగోలు చేయాలని ఆహారశుద్ధి పరిశ్రమలు, ట్రేడర్లను ఆదేశించామని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి సముద్ర తీరంలో 'మసులా బీచ్ ఫెస్ట్-2025'ను మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి గత సాయంత్రం ప్రారంభించారు. విద్యా, సాంస్కృతిక కేంద్రంగా.. స్వాతంత్ర్య, రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలిచిన మచిలీపట్నం చరిత్రను తెలిపేలా ఉత్సవాలు జరగనున్నాయని ఈ సందర్భంగా కందుల దుర్గేశ్ తెలుపుతూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో 63 వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మించనున్న గంధమల్ల జలాశయానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈరోజు శంకుస్థాపన చేస్తారు. ఈ మధ్యాహ్నం ముఖ్యమంత్రి తిర్మలాపూర్ చేరుకుని ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు సోలార్ యూనిట్లు తదితర సంక్షేమ కార్యక్రమాలు, పథకాల పంపిణీని ప్రారంభించనున్నారు. ఈ మేరకు తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో నిర్వహించనున్న బహిరంగసభకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే యాదాద్రి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో మొత్తం 1,300 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు నుంచి డిఎస్సి పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 30వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు పాటశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని డిఎస్సి కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. హాల్ టికెట్ లో పొరపాట్లు ఉంటే ఆధార్, పాన్, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు కార్డులు చూపించాలని ఆయన తెలుపుతూ,

వాయిస్... 28 సెకన్లు

---------------------------

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి ఉన్న కరవు భత్యం-డీఏలలో రెండింటిని చెల్లించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిన్న రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశ నిర్ణయాలను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాత్రికేయులకు వెల్లడించారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య ట్రస్టు ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపిందని చెప్పారు. హైదరాబాద్‌లో కొత్తగా 86 కి.మీ. మేర మూడు మార్గాల్లో మెట్రో నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదించిందని తెలుపుతూ,

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విజయవాడలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బందికి విద్యుత్ తో పనిచేసే ఇండక్షన్ స్టవ్‌లను మంత్రి నిన్న  అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,  రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55 వేల అంగన్వాడీ కేంద్రాలకు స్టౌవ్‌లను అందజేస్తున్నామని   చెప్పారు.  ఎల్‌పిజీ సిలిండర్ల సమస్యను ఇండక్షన్ స్టౌవ్స్ తో అధిగమించవచ్చని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..26 సెకన్లు

---------------------------

తెలంగాణలో మహిళా శిశుసంక్షేమం కోసం నిపుణులతో సలహా కమిటీని ఏర్పాటు చేస్తామని శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ  సీతక్క తెలిపారు. జిల్లా సంక్షేమాధికారులు, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల మేధోమథనం సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి నిన్న మాట్లాడారు. మూడు నెలలకోసారి జిల్లాల్లో ఈ తరహాలో సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎవరైనా బాలికలపై దాడులకు పాల్పడినా, అసభ్యంగా ప్రవర్తించినా కఠిన శిక్షలు విధిస్తామని, సంఘ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను రైల్వే బోర్డు నియమించింది. ఈ మేరకు గత సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సందీప్ మాథుర్ ఢిల్లీ రైల్వే సిగ్నల్ ఆధునికీకరణ ప్రాజెక్టు సారథిగా వ్యవహరిస్తున్నారు. ఈ అంశంపై విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు భరత్ స్పందిస్తూ రైల్వే జోన్ పనులు వేగవంతమయ్యేందుకు ఇది కీలక చర్య అని పేర్కొన్నారు. రైల్వేజోన్‌పై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వచ్చేలా చూస్తామని తెలిపారు.

ఇది ఇలా ఉండగా.. విశాఖ రైల్వే జోన్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు ఇది ముందడుగుగా నిలుస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం ఉభయ తెలుగురాష్ట్రాల్లో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు  మోస్తరు వర్షాలతో పాటు  కొన్ని చోట్ల పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ అధికారి  బి.శేఖర్ పేర్కొంటూ...

వాయిస్...32 సెకన్లు

మరోవైపు... తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================